యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త సీఎల్ రాజం, విజయరాజం దంపతులు, ఆంధ్రప్రభ ఎండీ ముత్తా గౌతమ్. చిత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

కేసీఆర్ భద్రత కుదింపు

పదేండ్ల సీఎంకు కేవలం 'వై' క్యాటగిరీ భద్రత?

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు భద్రత కుదిస్తున్నట్టు రాష్ట్ర పోలీసుశాఖ తెలిపింది. కేటీఆర్, హరీశ్‌రావు సహా గెలిచిన మాజీ మంత్రులకు ఎమ్మెల్యేలకు కేటాయించే భద్రతనే ఇచ్చినట్టు తెలిసింది. మాజీ సీఎం, క్యాబినెట్ ర్యాంకు కలిగిన ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌కు ప్రస్తుతం 'వై' క్యాటగిరీ భద్రతను కేటాయించినట్టు సమాచారం. థ్రెట్ పర్సప్షన్ రేట్(టీపీఆర్)కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మాజీ మంత్రులకు కూడా 2+2 భద్రతను కొనసాగిస్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి ఓడిపోయిన ఎమ్మెల్యేలందరికీ భద్రతను పూర్తిగా తీసివేశారు. ఇటీవల ప్రజాప్రతినిధుల భద్రతపై ఇంటెలిజెన్స్‌శాఖ సమీక్ష నిర్వహించి.. మాజీ ప్రజాప్రతినిధులు, మంత్రులకు ప్రాణహాని, ఇతరుల నుంచి ముప్పుగానీ లేదని అంచనాకు వచ్చి వారి భద్రత తొలగించింది. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి గన్‌మెన్‌లను రీకాల్ చేశారు.

ఎస్కార్ట్ వాహనం.. ఇంటిముందు సెంట్రీ

కేసీఆర్‌కు 'వై' క్యాటగిరీ భద్రత ఇచ్చినట్టు తెలిసింది. ఆయన వెంట నిత్యం నలుగురు భద్రతా సిబ్బంది, ఎస్కార్ట్, పైలట్ వాహనాలు ఉంటాయి. పదేండ్లు సీఎంగా చేసిన వ్యక్తికి 'నోన్ సోర్స్' నుంచి లేదా 'అన్‌నోన్ సోర్స్' నుంచి ప్రమాదం పొంచి ఉండొచ్చు. కేసీఆర్ భద్రతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేసీఆర్ ఇంటి ముందు ఓ సెంట్రీతో పాటు మరో ఇద్దరిని భద్రతగా ఉంచే అవకాశం ఉన్నది. మావోయిస్టులు గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేటికీ పోస్టర్లు విడుదల చేస్తున్నా భద్రతను తగ్గించటం అనుమానాలను రేకెత్తిస్తున్నది. ప్రస్తుతం కేసీఆర్ తుంటి సర్జరీతో యశోద దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మెరుగైన వెంటనే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లనున్నారు. ఆయన భద్రతపై ఇంటెలిజెన్స్ విభాగం మరోసారి పునరాలోచించాలనే డిమాండ్ వినిపిస్తున్నది. కేసీఆర్‌కు ఏ తరహా క్యాటగిరీ భద్రత కేటాయించారో ఇప్పటివరకు చెప్పలేదు.

ప్రస్తుతం 2+2 మాత్రమే

ఐటీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రపంచ దృష్టిని ఆకర్షించిన కేటీఆర్‌కు సైతం సాధారణ ఎమ్మెల్యేకు ఇచ్చిన భద్రతనే కేటాయించారు. హరీశ్‌రావుకూ 2+2 భద్రత ఇచ్చారు. ఓ సెలబ్రిటీగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌కు ఎమ్మెల్యేలతో సమానంగా భద్రత ఇవ్వటంపై పార్టీశ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతున్నది. గురువారం వరకు మాజీ మంత్రులకు 2+2 భద్రత ఉన్నదని, సాయంత్రం నుంచి వారిని కూడా వాపస్ తీసుకున్నారని తెలిసింది. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల గన్‌మెన్లను వాపస్ తీసుకోవాలని జిల్లాల యంత్రాంగానికి అడిషనల్ డీజీ నుంచి ఆదేశాలు వెళ్లాయి. బీఆర్ఎస్ మాజీ మంత్రులు ప్రస్తుత ఎమ్మెల్యేల భద్రతపై ఐఎస్‌డబ్ల్యూ మరోసారి సమీక్షించనున్నట్టు తెలిసింది. ప్రమాద ముప్పును అంచనా వేసి, భద్రత పెంచాలా? లేదా? అనేది నిర్ణయించనున్నారు. గెలిచిన ఎమ్మెల్యేలకు యథావిధిగా భద్రత కొనసాగనున్నది. బీజేపీ నుంచి రాజాసింగ్, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీకి భద్రతను కొనసాగిస్తారని సమాచారం.

నేడు కేసీఆర్ డిశ్చార్జి

బీఆర్ఎస్ అధినేతను పరామర్శించిన మాజీ స్పీకర్, మాజీ మంత్రులు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): యశోద దవాఖానలో ఏడు రోజులుగా చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, పార్టీ శాసనసభా పక్షనేత కేసీఆర్ శుక్రవారం డిశ్చార్జి కానున్నారు. ఈ విషయాన్ని వైద్యులు ప్రకటించారు. దవాఖాన నుంచి నేరుగా ఆయన బంజారాహిల్స్ నందినగర్‌లోని ఇంటికి రానున్నారు. గురువారం దవాఖానలో కేసీఆర్‌ను పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు పరామర్శించారు. పెద్దమ్మతల్లి ఆలయ అర్చకులు కేసీఆర్ త్వరగా కోలుకోవాలని దీవించారు.

కేసీఆర్‌ను పరామర్శించినవారిలో..

గురువారం కేసీఆర్‌ను పరామర్శించినవారిలో ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, గంగుల కమలాకర్, ప్రముఖ వ్యాపారవేత్త సీఎల్ రాజం దంపతులు, సినీనటుడు నరేశ్, మాజీ ఎమ్మెల్యేలు వీ శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, సోమా భరత్‌కుమార్, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల బాలరాజు, కోలేటి దామోదర్, ఆంజనేయగౌడ్, సతీశ్‌రెడ్డి, పల్లె రవికుమార్, బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, రాము, గాయకుడు దరువు ఎల్లన్న, ఆంధ్రప్రభ మేనేజింగ్ డైరెక్టర్, ఎడిటర్ ఇన్‌చార్జ్ ఎండీ ముత్తా గౌతమ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన సినీ ప్రముఖులు

ప్రముఖ సినీ దర్శకుడు జీవన్‌రెడ్డి, నటుడు సందీప్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు.

లాకప్‌డెత్‌పై విచారణ చేయాలి

- ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- డీజీపీతో సత్యవతి, సుమన్, దాసోజు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఇటీవల నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పాలెంతండాకు చెందిన నేనావత్ సూర్యనాయక్ లాకప్‌డెత్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. గురువారం గిరిజన సంక్షేమశాఖ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డీజీపీ రవిగుప్తాకు వినతిప్రతమిచ్చారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్యవతి మీడియాతో మాట్లాడుతూ అన్నదమ్ముల పంచాయితీలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి గిరిజనుడి మృతికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సీనియర్ అధికారితో సమగ్ర విచారణ చేపట్టాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం పదేండ్లు పాలించినా ఎక్కడా కవ్వింపు చర్యలకు పాల్పడలేదని గుర్తు చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ దారితప్పుతున్నదని దాసోజు శ్రవణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలకు పోలీసులు పావులుగా మారుతున్నారని పేర్కొన్నారు. తమ ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేస్తామని డీజీపీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

డీజీపీ రవిగుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న సత్యవతి రాథోడ్, బాల్క సుమన్, దాసోజు శ్రవణ్

ఆర్థిక వివేకం కేసీఆర్ సర్కారు లక్షణం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఆర్థిక వివేకం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన లక్షణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. మొత్తం పన్నులో 84.2 శాతం సొంత రాబడి పన్ను వసూళ్లు సాధించి తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన నిలవడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక వివేకం పాటించామని, దాని ఫలితాలు స్పష్టంగా ఉన్నాయని ట్వీట్ చేశారు. ఈ మేరకు పత్రికల్లో వచ్చిన ఆర్బీఐ నివేదిక కథనాన్ని ట్యాగ్ చేశారు.

సిరిసిల్ల ప్రజలకు కృతజ్ఞతలు

గురువారం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణం చేసిన కేటీఆర్, వరుసగా ఐదు సార్లు (2010 ఉప ఎన్నికలు సహా) తనను దీవించి అసెంబ్లీకి పంపినందుకు సిరిసిల్ల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

లోకం పోకడ

పార్లమెంటు భద్రత మీద నమ్మకం లేక తన జాగ్రత్తలో తనున్నాడట!

ఉద్యమస్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాడాలి

బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కోలేటి దామోదర్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఉద్యమస్ఫూర్తితో ప్రజలతో మమేకమై, సమస్యలపై పోరాడాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉద్యమ పార్టీగా ఉద్భవించిన బీఆర్ఎస్ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రజాభిమానంతో పదేండ్లు సుస్థిరపాలన అందించిందని తెలిపారు. కార్యకర్తలు నైరాశ్యానికి లోనుకావద్దని కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలతోనే తమ జీవితాల్లో వెలుగులు వచ్చాయన్న భావనతో తెలంగాణ ప్రజానీకం ఉన్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	10.4°c	31.9°c
మెదక్	12.3°c	32.8°c
ఆదిలాబాద్	13.0°c	33.0°c
హైదరాబాద్	15.5°c	27.5°c
వరంగల్	16.0°c	29.0°c
కరీంనగర్	16.0°c	28.0°c
నిజామాబాద్	16.3°c	29.7°c
నల్లగొండ	16.4°c	31.6°c
ఖమ్మం	18.0°c	29.0°c
మహబూబ్‌నగర్	19.5°c	29.5°c

అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్

- ఏకగ్రీవ ఎన్నిక.. బాధ్యతల స్వీకరణ
- మంచి సంప్రదాయానికి తొలిరోజే నాంది: సీఎం రేవంత్
- అధినేత కేసీఆర్ ఆదేశాలతోనే బీఆర్ఎస్ మద్దతు: కేటీఆర్
- ప్రజల గళాన్ని వినిపించే అవకాశమివ్వాలి: బీఆర్ఎస్ నేతలు
- ఇద్దరు మంత్రులు, కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యేల ప్రమాణం

శాసన సభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాసన సభ స్పీకర్ పదవికి గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ మద్దతు పలికాయి. దీంతో స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ కలిసి గడ్డం ప్రసాద్‌ను తోడ్కొని వెళ్లి శాసనసభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీటీసీ నుంచి శాసన సభాపతిగా

శాసన సభాపతిగా ఎన్నికైన గడ్డం ప్రసాద్ 1964లో వికారాబాద్ జిల్లా మర్పల్లి గ్రామంలో దళిత కుటుంబంలో జన్మించారు. తాండూరులో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. తొలుత ఎంపీటీసీగా గెలిచి, ఆ తర్వాత ఎంపీపీగా సేవలు అందించారు. 2008 ఉప ఎన్నికలో వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో రెండోసారి గెలుపొంది, 2012లో కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో చేనేత, చిన్నతరహా పరిశ్రమలశాఖ మంత్రిగా సేవలందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోసారి వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా విజయాన్ని అందుకుని స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

ఏకగ్రీవం మంచి సంప్రదాయం: సీఎం రేవంత్

శాసనసభలో స్పీకర్‌కు ధన్యవాద తీర్మానంపై తొలుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. స్పీకర్ ఎన్నికకు సహకరించిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ తొలిరోజే మంచి సంప్రదాయానికి నాంది పలికిందని, భవిష్యత్తులోనూ ఇదే సంప్రదాయం కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను సభ ద్వారా నెరవేరుద్దామని కోరారు. మంత్రిగా ప్రసాద్ చేసిన సేవలను గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, తుమ్మల, సీతక్క, కొండా సురేఖతోపాటు పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడారు. విపక్షాల నుంచి కూనంనేని సాంబశివరావు, భలాలా మాట్లాడారు.

కేసీఆర్ ఆదేశాలతోనే మద్దతు: కేటీఆర్

స్పీకర్‌కు ధన్యవాద తీర్మానంపై బీఆర్ఎస్ నుంచి తొలుత మాజీ మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. స్పీకర్ ఎన్నికకు మద్దతివ్వాలని మంత్రి శ్రీధర్ బాబు కోరగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అందుకు సంపూర్ణ మద్దతివ్వాలని తమను ఆదేశించారని తెలిపారు. స్పీకర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రసాద్ చేనేత మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోనే అత్యధికమంది చేనేత కార్మికులు ఉన్న సిరిసిల్లకు విచ్చేయాలని ఎమ్మెల్యేగా తాను స్వయంగా విజ్ఞప్తి చేశానని వివరించారు. అయితే తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్నందున సిరిసిల్లకు విచ్చేసేందుకు కొంత సంశయం వ్యక్తం చేయగా, తానే స్వయంగా ఆయనను తీసుకుని వెళ్లానని గుర్తుచేశారు. చేనేత కార్మికుల సమస్యలను వినడంతో పాటు, తన శక్తిమేరకు పరిష్కరించారని తెలిపారు. స్పీకర్‌గా ఎన్నికైన ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి తరహాలోనే సభా హక్కులను కాపాడాలని కోరారు. సామాన్య ప్రజలు సమస్యలు చర్చకు వచ్చేలా చూడాలని, ముఖ్యంగా ప్రజల తరపున మాట్లాడే నాయకులకు అధిక సమయమివ్వాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కడియం శ్రీహరి, ప్రశాంత్‌రెడ్డి, దానం నాగేందర్ తదితరులు మాట్లాడారు.

నా బండిపైనే నామినేషన్‌కు తీసుకెళ్లా: యాదయ్య

శాసనసభ స్పీకర్‌కు ధన్యవాద తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ ప్రసాద్, తాను అపూర్వ స్నేహితులమని గుర్తుచేశారు. పక్కపక్క మండలాల నుంచే ఒకేసారి ఎంపీటీసీలుగా ఎన్నికయ్యామని తెలిపారు. వికారాబాద్ స్థానం కోసం ఇద్దరం 4 సార్లు పోటీపడ్డామని, 2008లో నామినేషన్ వేసేందుకు ట్రాఫిక్ వల్ల ఆలస్యమైతే తన బైక్‌పైనే తీసుకువెళ్లానని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధినేత తనను వికారాబాద్ నుంచి పోటీ చేయాలని రెండు సార్లు కోరినా తాను చేయలేదన్నారు. చిరకాల మిత్రుడు స్పీకర్ కావడంపై సంతోషకరమని చెప్పారు.

అసెంబ్లీలో 'డాడీ ఐ లవ్యూ'

అసెంబ్లీలో ఊహించని పరిణామం చోటుచేసుకున్నది. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణం చేస్తున్న సమయంలో ఆయన కుమార్తె మీడియా గ్యాలరీలో నుంచి 'ఐ లవ్యూ డాడీ' అని పెద్దపెట్టున అరవడంతో సభ్యులు ఉలిక్కిపడ్డారు. అసలు విషయం తెలిసి కుదుటపడ్డారు. కౌశిక్‌రెడ్డి కుమార్తెను భద్రతా సిబ్బంది మీడియా గ్యాలరీ నుంచి విజిటింగ్ గ్యాలరీకి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తున్న కేటీఆర్

ఇద్దరు మంత్రుల ప్రమాణ స్వీకారం..

అంతకుముందు సభ మొదలైన వెంటనే పలువురు సభ్యుల చేత ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రమాణం చేశారు. దీంతో మొత్తంగా 117 మంది ప్రమాణస్వీకారం పూర్తయింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైద్యచికిత్స పొందుతున్న నేపథ్యంలో ప్రమాణస్వీకారం చేయలేదు. మరో సభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి కూడా హాజరు కాలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ నియామాకాన్ని వ్యతిరేకిస్తూ ప్రమాణ స్వీకారానికి బీజేపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికైన అనంతరం బీజేపీ సభ్యులు అసెంబ్లీలోకి ప్రవేశించారు. అనంతరం స్పీకర్ సమక్షంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్, రామారావు పవార్, డీ సూర్యనారాయణ, టీ రాజాసింగ్ ప్రమాణం చేశారు.

పార్టీలకతీతంగా సేవలందిస్తా: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సభ్యుల ప్రసంగం అనంతరం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తనకు శుభాకాంక్షలు తెలియజేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సభలో అర్థవంతమైన చర్చలు కొనసాగాలని ఆకాంక్షించారు. చర్చల్లో చురుగ్గా పాల్గొని అభివృద్ధికి పాటుపడాలని అభిలషించారు. పార్టీలకతీతంగా సేవలందిస్తానని, సమస్యల ఆధారంగా సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సభ నిర్వహణలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ సహకరించాలని కోరారు. అనంతరం సభను శుక్రవారం ఉదయం 11.30కు వాయిదా వేశారు.

బంగారు పళ్లెంలో వనరులు అప్పగించాం

- ఆర్థిక వనరుల్లో మనది దేశంలో 2వ స్థానం
- ఆర్బీఐ నివేదికలే ఇందుకు నిదర్శనం
- తెలంగాణను అప్పుల కుప్ప అనొద్దు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక వనరులున్న బంగారు పళ్లెంలో పెట్టి అప్పగించామని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పదేపదే తెలంగాణను అప్పుల కుప్ప చేశారని పేర్కొనటాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలోని 28 రాష్ట్రాల ఆర్థిక వనరుల వివరాలతో ఆర్బీఐ విడుదల చేసిన ఆర్థిక విశ్లేషణను పరిశీలించాలని సూచించారు. ఆర్బీఐ తాజా నివేదిక ప్రకారం రాష్ట్ర సొంతపన్నుల ఆదాయాన్ని (ఎస్వోటీఆర్) సమకూర్చుకోవడంలో తెలంగాణ 84.2 శాతంతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. పదేండ్ల కాలంలో కేసీఆర్ ఎంతో శ్రమించి పెంచిన ఎస్వోటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి మంచి పాలనను అందించాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల ఆర్థిక వనరుల కన్నా తెలంగాణ ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయని స్పష్టంచేశారు. పుష్కలమైన విద్యుత్తు, నీటి సౌకర్యం కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరిగాయని వివరించారు. రాష్ట్రంలో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్తు సరఫరా వల్ల మూడు షిఫ్టుల్లో పరిశ్రమలు పనిచేయడం, ఐటీ రంగంలో గణనీయమైన పురోగతిని సాధించామని వెల్లడించారు. 2014లో 7,778 మెగావాట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యం ఉంటే, ప్రస్తుతం 26,000 మెగావాట్ల స్థాపిత ఉత్పత్తి సామర్థ్యమే ఇందుకు నిదర్శనమని స్పష్టంచేశారు.

శైలజా రామయ్యర్ | ఆమ్రపాలి కాట | కృష్ణభాస్కర్ | ముషారఫ్ అలీ | సందీప్‌కుమార్ ఝా | బీ గోపి | కర్నాటి వరుణ్‌రెడ్డి

ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీగా రిజ్వీ

డిప్యూటీ సీఎం ఓఎస్డీగా కృష్ణభాస్కర్

ఆమ్రపాలికి హెచ్ఎండీఏలో పోస్టింగ్

రాష్ట్రంలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా విద్యుత్తుశాఖపై ప్రత్యేక దృష్టి సారించినట్టు స్పష్టం అవుతున్నది. వైద్యారోగ్యశాఖ కార్యదర్శిగా ఉన్న ఎస్ఎం రిజ్వీని ఇంధన శాఖ కార్యదర్శిగా నియమిస్తూనే ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. బదిలీ అయిన 8 మందిలో నలుగురిని విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలకే కేటాయించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఓఎస్డీగా కృష్ణభాస్కర్‌ను నియమించింది. కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి వచ్చిన ఆమ్రపాలికి హెచ్ఎండీఏలో పోస్టింగ్ ఇచ్చింది.

ఐఏఎస్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఎస్ఎం రిజ్వీ	వైద్యారోగ్యశాఖ కార్యదర్శి	ఇంధన శాఖ కార్యదర్శి, ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ
సందీప్‌కుమార్ ఝా	ఐటీశాఖ సంయుక్త కార్యదర్శి	జీఎండీ, టాన్స్‌కో
ముషారఫ్ అలీ ఫారూఖీ	వెయిటింగ్	సీఎండీ, టీఎస్ఎస్పీడీసీఎల్
కర్నాటి వరుణ్‌రెడ్డి	వెయిటింగ్	టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ
కృష్ణభాస్కర్	ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి	ఓఎస్డీ, డిప్యూటీ సీఎం
శైలజా రామయ్యర్	యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి	వైద్యారోగ్య శాఖ కార్యదర్శి
ఆమ్రపాలి కాట	వెయిటింగ్	హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఎండీ
బీ గోపి	వెయిటింగ్	అగ్రికల్చర్ డైరెక్టర్

అక్రమ కేసుపై కోర్టును ఆశ్రయిస్తా

గిరిజనుల భూములతో సంబంధం లేదు • ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తనపై అక్రమ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై కోర్టును ఆశ్రయించనున్నట్టు మాజీ మంత్రి, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గిరిజన భూములతో తనకు ఎలాంటి సంబంధం లేకుండా అట్రాసిటీ కేసును ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. గిరిజనుల భూమిని ఆ